నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, బుధవారం 12 మార్చి 2025 | KARIMNAGAR

## టెన్త్ విద్యార్థులకు కేటీఆర్ కానుక

గిఫ్ట్ ఏ స్మైల్ కింద పరీక్ష ప్యాడ్లు, పెన్నులు



పరీక్ష ప్యాడ్లతో తంగళ్లపల్లిలోని జడ్పీఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు

సిరిసిల్ల రూరల్, మార్చి 11 : పదో తరగతి విద్యార్థులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కానుక పంపించారు. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఎగ్జామ్స్ బాగా రాయాలని శుభాకాంక్షలు చెబుతూ ప్రతి ఏడాది మాదిరి ఈ సంవత్సరం సైతం 'గిఫ్ట్ ఏ స్మైల్'లో భాగంగా సిరిసిల్ల నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపించగా, మంగళవారం పార్టీ నాయకులు స్కూళ్లకు వెళ్లి అందజేశారు.

## తాగునీటికి తంటాలు



వ్యవసాయ బావి నుంచి తాగునీరు తెచ్చుకుంటున్న గ్రామస్తులు

గంభీరావుపేట, మార్చి 11: రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని రాజేశ్వర్‌రావునగర్ గ్రామస్తులు తాగు నీటి కోసం వారం రోజులుగా తండ్లాడుతున్నారు. గ్రామ పంచాయతీకి చెందిన నాలుగు బోర్లతో పాటు మంచినీటి బావిలో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి పోవడంతో వ్యవసాయ బావుల నుంచి బిందెలలో తెచ్చుకుంటూ కాలం వెల్లదీస్తున్నారు. ఈ గ్రామంలో 180 కుటుంబాలు ఉండగా 726 జనాభా ఉన్నది. మిషన్ భగీరథ ద్వారా ప్రతి రోజు 60 వేల లీటర్ల తాగు నీరు అందించాల్సి ఉండగా, ప్రస్తుతం మూడు రోజులకు ఒక్కసారి మూడో వంతు 20 వేల లీటర్ల తాగు నీరు మాత్రమే అందిస్తున్నారు. అటు పంచాయతీ బోర్లు ఎండి పోయి, ఇటు మిషన్ భగీరథ నీరు సరిపడా రాకపోవడంతో దూరంలో ఉన్న వ్యవసాయ బావుల వద్దకు నడుచుకుంటూ వెళ్లి బిందెలతో తెచ్చుకుంటున్నారు. దీంతో మిగతా పనులు చేసుకోలేకపోతున్నామని ఆందోళన చెందుతున్నారు.

# గోదావరి ఎడారి.. భూములు తడారి



పొలంలో పశువులను మేపుతున్న రైతు రవి

- వట్టిపోయిన నది.. సమీప గ్రామాల్లో అడుగంటిన భూగర్భజలాలు
- ముత్తారం మండలంలో దెబ్బతింటున్న పంటలు
- బర్రెమడుగు ప్రాంతంలో ఎండుతున్న 30 ఎకరాలు
- ప్రశ్నార్థకంగా మరో వంద ఎకరాలు
- సర్కారు వివక్ష వల్లే అంటున్న రైతులు

ముత్తారం, మార్చి 11: ఏడాదిన్నర క్రితం వరకు కాళేశ్వరం ఎత్తిపోతల పథకంతో గోదావరి నిండు కుండలా ఉండేది. పరీవాహక గ్రామాల్లో భూగర్భజలాలు పైపైనే కనిపించేవి. చెరువులు, కుంటలే కాదు బోర్లు, బావులు నిండుగా ఉండేవి. అప్పుడు సమృద్ధిగా నీళ్లంది భూములు సస్య శ్యామలమయ్యాయి. ఇలానే ముత్తారం మండలంలోనూ పుష్కలమైన పంటలు పండాయి. కానీ, ప్రస్తుతం పరిస్థితి దయనీయంగా మారింది. కాంగ్రెస్ వివక్ష వల్ల గోదావరి నీటిని దిగువకు వదలడంతో ఎడారిని తలపిస్తున్నది. దీంతో సమీప అడవిశ్రీరాంపూర్ పరిసరాల్లో భూగర్భజలాలు అడుగంటాయి. శివారులోని బర్రెమడుగులో 30 ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి. మరో వంద ఎకరాలు ఎండిపోయే పరిస్థితులున్నాయి. పంటలను కాపాడుకునేందుకు రైతులు దాదాపు ₹30లక్షలు ఖర్చు పెట్టి, కొత్తగా 50 బోర్లు వేయించినా ఫలితం లేకపోయింది. ఇటు ఎస్సారెస్పీ కాలువ ఉన్నా ఇప్పటి వరకు చుక్క నీరు రాలేదు. శుక్రవారంపేటలోని 2 టీఎంసీ రిజర్వాయర్ నుంచి మండలంలోని చివరి ఆయకట్టు వరకు నీరు ఇవ్వడం లేదు. బర్రెమడుగు శివారులోని అటవీప్రాంతంలో కొత్తమాటు చెరువుకు నీళ్లిచ్చినా భూగర్భజలాలు పెరిగేవి. కానీ, కానీ ఈ చెరువులోకి నీటిని తీసుకొచ్చే కాలువ పూర్తి కాకపోవడంతో నీరిచ్చే పరిస్థితి లేదు. ఇలాంటి పరిస్థితుల్లో పంటలు ఎండుతుండగా, రైతులు ఆగమవుతున్నారు. చేసేదేమీ లేక పంటలను పశువులకు వదిలేస్తున్నారు. ఎకరాకు ₹25వేల నుంచి ₹30 వేల వరకు పెట్టుబడి నష్టపోయామని కన్నీటి పర్యంతమవుతున్నారు. పంటలు నష్టపోవడం పదేళ్లలో ఇదే మొదటి సారని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని, నీళ్లిచ్చి పంటలను కాపాడాలని వేడుకుంటున్నారు. నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలని కోరుతున్నారు.

### పెట్టుబడి నష్టపోయినం

మూడెకరాలు నాటు వేసినం. పొలం చేతికచ్చే దశలో మొత్తం ఎండిపోయింది. చేసిన కష్టం రాళ్లపాలు అయినట్టు అయింది. ఉన్న బోరు ఎండిపోవడంతో మళ్లీ ఇంకో బోరు వేసినం. దానికి లక్ష రుపాయాలు అయింది. కానీ చుక్క నీరు రాలేదు. పెట్టిన లక్ష పెట్టుబడి నష్టపోయినం. పూర్తిగా ఎండిన పంటపొలాలను ప్రభుత్వం సర్వే చేయించాలి. నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి.

**- నిమ్మతి ప్రమీల, మహిళా రైతు (అడవిశ్రీరాంపూర్)**



ఎండిన పొలంలో మేస్తున్న గొర్లు



### పంటను ఇడిసిపెట్టిన.. గొర్లు మేపుకుంటున్న



ఇంతకుముందు కాళేశ్వరం ప్రాజెక్టు నిండు కుండలా ఉండేది. వానకాలంలో అయితే నా బోరు మోటర్ లేకుండానే నీరు పైకి ఉబికి వచ్చేంది. నా రెండున్నర ఎకరాల పొలం మొత్తం పారేది. అలాంటిది ఎన్నడు లేని విధంగా నా బోరు ఎండిపోయింది. పంట ఎండుతున్నదని మళ్లీ బోరు ఏసిన. ఏం లాభం లేదు. చేతికొచ్చిన పంట మొత్తం పోయింది. చేసేదేమీ లేక ఇడిసిపెట్టిన. గొర్లు మేపుకుంటున్న. కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లుంటే మాకీ దుస్థితి వచ్చేది కాదు.

**- తోట సమ్మయ్య, రైతు (అడవిశ్రీరాంపూర్)**

# తడి బట్టలతో వచ్చిన.. మీకు వచ్చే దమ్ముందా..?

- మట్టి, బూడిద రవాణాలో అక్రమాలపై చర్చకు రండి
- కాంగ్రెస్ నాయకులకు బీఆర్ఎస్ నాయకుడు కౌశిక హరి సవాల్
- తడిబట్టలతో పోచమ్మ గుడిలోకి ప్రవేశం
- మాజీ ఎమ్మెల్యే కోరుకంటి సారథ్యంలో ఖని చౌరస్తాలో బైఠాయింపు
- గులాబీ ఆందోళనతో ఉలిక్కిపడ్డ కాంగ్రెస్ శ్రేణులు



గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో బైఠాయించిన బీఆర్ఎస్ నాయకుడు కౌశిక హరి, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి, కార్యకర్తలు

గోదావరిఖని, మార్చి 11 : మట్టి, బూడిద రవాణాలో అక్రమాలు జరుగుతున్నవి నిజం అయినందునే తాను తడిబడ్డలతో పోచమ్మ గుడిలోకి వచ్చానని బీఆర్ఎస్ నాయకుడు కౌశిక హరి స్పష్టం చేశారు. అబద్ధమైతే కాంగ్రెస్ నాయకులు పోచమ్మ గుడిలోకి తడిబట్టలతో వచ్చే దమ్ముందా? సవాల్ విసిరారు. రామగుండం నియోజకవర్గంలో ఎన్టీపీసీ బూడిద రవాణాతోపాటు మద్దిర్యాలలో మట్టి అక్రమ తవ్వకాలు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ కనుసన్నల్లో జరుగుతున్నాయని ఆరోపణలు చేసిన ఆయన మంగళవారం బహిరంగ చర్చకు వచ్చారు. గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో గోదావరి జలాలతో స్నానం చేసి తడిబట్టలతో పోచమ్మ గుడిలోకి ప్రవేశించారు. అనంతరం ఆలయం బయట రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్‌తోపాటు ఆయన అనుచరులకు సవాల్ విసిరారు. రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ సారథ్యంలో చౌరస్తాలో బైఠాయించి పెద్దపెట్టున నినాదాలు చేశారు. రామగుండం ఎమ్మెల్యేతోపాటు ఆయన వర్గీయులు స్థానికంగా ఉన్నప్పటికీ స్పందించలేదని, అక్రమాలు నిజమనడానికి ఇదొక్కటే నిదర్శనమని కౌశికహరి విమర్శించారు. నిరాధారమైన ఆరోపణలు ఎవరు చేస్తున్నారో.. బూడిద, మట్టి అక్రమాలకు ఎవరు పాల్పడుతున్నారో తేటతెల్లం అయ్యిందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకులు రామగుండం నియోజకవర్గంలో చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొని ఒక చీకటి సామ్రాజ్యాన్ని నడిపిస్తున్నారంటూ తీవ్ర విమర్శలు చేశారు. ఖని వన్ టౌన్ పోలీసులు జోక్యం చేసుకొని ఆందోళనకారులను సముదాయించారు. అయితే ఈ ఘటనతో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉలిక్కిపడ్డారు. కౌశికహరి విసిరిన సవాల్‌కు రామగుండం ఎమ్మెల్యే గానీ, ఆ పార్టీ నాయకులు ఎవరూ స్పందించకపోవడంతో జనం ముక్కున వేలేసుకున్నారు. కాంగ్రెస్ నాయకులు తోకముడిచారంటూ విమర్శలు గుప్పించారు.

### ప్రజల చేతిలో గుణపాఠం తప్పదు

**- కోరుకంటి చందర్, మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు**

రామగుండంలో అధికార పార్టీ కాంగ్రెస్ విచ్చలవిడిగా దోపిడీ చేస్తున్నదని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ధ్వజమెత్తారు. నియోజకవర్గంలో జరుగుతున్న మట్టి, బూడిద దందాను తమ పార్టీ నాయకుడు కౌశిక హరి బయటపెట్టడమే కాకుండా తవ్వకాలు జరుగుతున్న ప్రదేశానికి వెళ్లి కూడా చూపించాడని, దీనిపై రామగుండం ఎమ్మెల్యే సమాధానం చెప్పకుండా తన చోటామోటా కార్యకర్తలతో తిరిగి బీఆర్ఎస్‌పైనే నిరాధారమైన ఆరోపణలు చేయించడం సిగ్గుచేటన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థకే ఇది గొడ్డలి పెట్టన్నారు. ప్రశ్నించే గొంతులను నొక్కడమే 'మీ ప్రతాపమా?' అని ప్రశ్నించారు. వ్యక్తిగత ఆరోపణలు చేయడం మానుకోవాలని, ప్రతిపక్షాలుగా తాము ప్రశ్నిస్తామని, మీ అక్రమాలు నిజం కాకపోతే నిరూపించుకోవాల్సిన బాధ్యత మీకు లేదా? అని నిలదీశారు. వాస్తవాలను ప్రజలంతా గమనిస్తున్నారని, ప్రజల చేతిలో కాంగ్రెస్ నాయకులకు గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఇప్పటికైనా కలెక్టర్ గానీ, మైనింగ్ అధికారులు గానీ స్పందించి అక్రమాలపై చర్యలు తీసుకుంటే కలెక్టరేట్‌తోపాటు ఇటు రామగుండం ఎమ్మెల్యే కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ ఆందోళనలో మాజీ డిప్యూటీ మేయర్ అభిషేక్‌తోపాటు మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి ర్యాలీగా వస్తున్న పసుపు రైతులు

# రోడ్డెక్కిన పసుపు రైతు

- మద్దతు ధర కోసం పోరుబాట
- మెట్‌పల్లిలో మహార్యాలీ, రోడ్డుపై బైఠాయింపు
- రెండు గంటల పాటు నిలిచిన వాహనాల రాకపోకలు
- ఆర్డీవో హామీతో శాంతించిన రైతులు

**పసుపు పంటకు కనీస గిట్టుబాటు ధర లభించడం లేదని రైతులు మెట్‌పల్లిలో రోడ్డెక్కారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై నోరుమెదపని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై ఆగ్రహించారు. పసుపు బోర్డు పేరిట ఒకరు, మద్దతు ధర పేరిట మరొకరు ఎన్నికల వేళ ఓట్లకోసం మభ్యపెట్టి లబ్ధిపొందారే తప్ప చేసిందేమీలేదని మండిపడ్డారు. తక్షణమే పసుపునకు మద్దతు ధర ప్రకటించి తమను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.**

మెట్‌పల్లి, మార్చి 11 : పసుపు రైతులు మద్దతు ధర కోసం పోరుబాట పట్టారు. రైతు ఐక్యవేదిక ఆధ్వర్యంలో జిల్లాలోని నలుమూలల నుంచి మెట్‌పల్లికి తరలివచ్చారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి 63వ జాతీయ రహదారి మీదుగా ర్యాలీగా పాతబస్టాండ్‌కు చేరుకున్నారు. రోడ్డుపై బైఠాయించి మెరుపు ధర్నా చేపట్టారు. కనీస గిట్టుబాటు ధర లభించకపోవడంతో పంట సాగుకు పెట్టిన ఖర్చులు నిండడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పసుపునకు క్వింటాల్‌కు ₹15 వేలు మద్దతు ధర ప్రకటించాలని, ఎంఐఎస్ పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి కేంద్రాలను ప్రారంభించి నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలప్పుడు ఓట్ల కోసం తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే పసుపునకు మద్దతు ధర కల్పిస్తామని మేనిఫెస్టోలో చెప్పిన కాంగ్రెస్ పార్టీ తీరా అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడం లేదని ఎండగట్టారు. మార్కెట్ యార్డులో క్యాష్ కటింగ్‌ను అరికట్టాలని, సిండికేట్‌గా ఏర్పడి పసుపు ధరలను తగ్గిస్తున్న దళారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, రహదారిపై మెరుపు ధర్నాతో ఇరువైపులా వాహనాల రాకపోకలు నిలిచిపోగా, స్థానిక పోలీసులు జోక్యం చేసుకుని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కలెక్టర్ గానీ, ఆర్డీవో గానీ వస్తే తమ గోడును చెప్పుకుంటామని, అంత వరకు ధర్నాను విరమించేదిలేదంటూ భీష్మించుకూర్చున్నారు. పోలీసుల విజ్ఞప్తితో రైతుల వద్దకు ఆర్డీవో శ్రీనివాస్ చేరుకోగా, రైతులు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. పసుపునకు మద్దతు ధర, కొనుగోలు కేంద్రాల అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడంతో శాంతించిన రైతులు ఆందోళనను విరమించారు. ఆందోళనలో రైతు ఐక్యవేదిక నాయకులు, ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి, మల్లాపూర్, కోరుట్ల, కథలాపూర్, మేడిపల్లి మండలాలతోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

### క్వింటాల్‌కు ₹15వేలు ప్రకటించాలి



క్వింటాల్ పసుపునకు కనీసం ₹15 వేలు మద్దతు ధర ప్రకటించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఎంఐఎస్ స్కీం పథకం కింద కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతుల నుంచి పసుపును నేరుగా కొనాలి. పసుపు బోర్డును నిజామాబాద్‌లో ఏర్పాటు చేయడం సంతోషమే అయినా, మద్దతు ధరను కూడా ప్రకటించి పసుపు రైతులను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలి.

**- బద్దం శ్రీనివాస్‌రెడ్డి, రైతు ఐక్యవేదిక నాయకుడు (ఇబ్రహీంపట్నం)**



ఆర్డీవోకు వినతి పత్రం అందజేస్తున్న పసుపు రైతులు

### దళారీ వ్యవస్థను అరికట్టాలి



పసుపు కొనుగోళ్లలో దళారీ వ్యవస్థను అరికట్టాలి. నాణ్యత పేరిట మార్కెట్‌లో దళారులు పసుపు ధరలను రోజురోజుకూ తగ్గిస్తూ రైతులను మోసం చేస్తున్నరు. అసెంబ్లీ ఎన్నికల్లో క్వింటాల్ పసుపునకు కనీసం రూ.12 వేలు మద్దతు ఇస్తామని వరంగల్‌లో కాంగ్రెస్ పార్టీ పెద్దలు డిక్లరేషన్‌ను విడుదల చేసిన్రు. కానీ, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ డిక్లరేషన్‌ను పట్టించుకోవడం లేదు.

**- డబ్బ రమేశ్‌రెడ్డి, రైతు ఐక్యవేదిక నాయకుడు (మల్లాపూర్)**

### మద్దతు ధర వచ్చేదాకా పోరాటం



పసుపునకు మద్దతు ధర సాధించుకునే వరకు పోరాటం ఆపేది లేదు. ఎన్నికల మేనిఫెస్టో పెట్టిన హామీలు అలాగే మిగిలిపోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆచరణలో పెట్టాలి. దేశానికి అన్నం పెట్టే రైతుల గోసను పట్టించుకుని పసుపు పంటను మద్దతు ధరల జాబితాలో చేర్చి క్వింటాల్‌కు కనీసం ₹15 వేలు మద్దతు ధర ప్రకటించి ఆదుకోవాలి.

**- గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, పసుపు రైతు, భూషణ్‌రావుపేట (కథలాపూర్ మండలం)**

## రేపు ఉద్యోగ మేళా

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, మార్చి 11 : నిరుద్యోగ యువకులకు హైదరాబాద్‌లోని క్వాస్ క్రాప్ లిమిటెడ్‌లో ఉద్యోగాల కోసం ఈ నెల 13న గురువారం కరీంనగర్ జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వై తిరుపతి రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇయర్ ప్యాడ్స్ తయారీ, వైర్ హౌస్ ఆపరేటర్ పోస్టుకు ఇంటర్వ్యూలు ఉన్నాయన్నారు. ఇందులో పదో తరగతి నుంచి డిగ్రీ వరకు అభ్యర్థులు అర్హులని, వారి వయస్సు 18 నుంచి 35 ఏళ్ల వరకు ఉండాలని సూచించారు. ఆసక్తి గల వారు కశ్మీర్‌గడ్డలోని ఈ సేవ కేంద్రం ఉన్న పై అంతస్తులో నిర్వహించే ఉద్యోగ మేళాకు హాజరు కావాలని, మరిన్ని వివరాలకు 95734 26092, 72076 59969, 99082 30384లో సంప్రదించాలని ఆయన సూచించారు.



గాయాలైన దీపికకు వైద్యం అందిస్తున్న ఆర్ఎంపీ

# వామ్మో.. పులి!

- భయంతో పరుగులు తీసిన 'ఉపాధి' కూలీలు
- ఇద్దరికి తీవ్ర గాయాలు

కొడిమ్యాల, మార్చి 11 : మండలంలోని గంగరాంతండా గ్రామ శివారులోని వన నర్సరీలో మంగళవారం ఉదయం ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు ఒక్కసారిగా వచ్చిన అలికిడితో చిరుత పులి వచ్చిందని భయంతో పరుగులు తీశారు. దీంతో పలువురు గాయపడ్డారు. అటవీశాఖ అధికారులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగారాంతండాకు చెందిన భూక్యా దీపిక, భూక్యా గౌరి ఉదయం గ్రామ శివారులోని వన నర్సరీలో మొక్కలకు నీళ్లు పట్టేందుకు వెళ్లారు. అక్కడ పనులు చేసుకుంటుండగా సమీపంలోని అటవీ ప్రాంతంలో అలికిడి కావడంతో అటుగా చూశారు. చిరుత పులి కనిపించగా భయంతో కేకలు వేస్తూ పరుగులు తీశారు. దీంతో కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గమనించి స్థానిక ఆర్ఎంపీ వద్ద చికిత్స అందించారు. ఘటనా స్థలాన్ని కొడిమ్యాల ఫారెస్టు రేంజర్ గులామ్ మొహినొద్దీన్, సెక్షన్ అధికారి సుబ్బారావు, ముషిర్, సిబ్బంది పరిశీలించారు. పులిని చూసిన గౌరిని అటవీ శాఖ అధికారులు పిలిపించుకొని, అమెకు నాలుగు రకాల ఫొటోలు చూపించారు. చిరుత పులి ఫొటో కూడా చూపించడంతో అధికారులకు కొత్త సమస్య వచ్చిపడింది. గతంలో ఈ ప్రాంతంలో పెద్ద పులి మాత్రమే ఉండేది. ప్రస్తుతం చిరుతను కూడా చూసినట్లు స్థానికులు తెలుపడంతో ఆ దిశగా గస్తీ నిర్వహించారు. ఫారెస్టు రేంజర్ మొహినొద్దీన్ మాట్లాడుతూ చిరుతకు సంబంధించిన ఆనవాళ్లు కనించలేదని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా పులికి హాని తలపెడితే అటవీ సెక్షన్ల ప్రకారం చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని, రైతులు తమ పంటపొలాలకు ఉదయం 11 గంటలకు వెళ్లి సాయంత్రం 4 గంటల వరకు ఇంటికి చేరుకోవాలన్నారు. ఒక్క రోజుకు పెద్ద పులి 34 కిలో మీటర్లు నడుస్తుందన్నారు. ఇటీవలే ఫాజుల్‌నగర్‌లో పెద్దపులి కనిపించిందని తెలిపారు. వాటికి సంబంధించిన వీడియో సీసీ కెమెరాలో రికార్డు అయినట్లు తెలిపారు. మండలంలోని గంగారాంతండ, సూరంపేట, దమ్మయ్యపేట, బోల్లెన్‌చెరువు, కొండాపూర్, రామకిష్టాపూర్, నల్లగొండ గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.